

●7లో..
వచ్చిన వరద వచ్చినట్టే దిగువకు

స్వామివారి దర్శనం.. మరువలేని అనుభూతి

● ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ పునర్నిర్మాణం ● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ● తొలిసారి యాదగిరీశుడిని దర్శించుకున్న గవర్నర్



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని వెలుపలికి వస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భువనగిరి అర్బన్, ఆగస్టు 27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకోవడం మరువలేని అనుభూతిని ఇచ్చిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. యాదగిరిగుట్టకు మంగళవారం తొలిసారి వచ్చిన గవర్నర్ స్వామివారి దర్శనం అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. స్వామివారి దర్శనం ఒక జీవిత కాలం తృప్తినిచ్చిందన్నారు. మళ్లీ ఇంకోసారి స్వామివారి దర్శనానికి ఇక్కడకు వస్తానన్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ పునర్నిర్మాణం జరిగిందని, ఆలయంలో శిల్పకళా వైభవం అద్భుతంగా ఉందని, నిర్మాణశైలి విశిష్టంగా ఉందన్నారు.

పర్యటన సాగిందిలా..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం దర్శించుకునేందుకు వచ్చారు. క్షేత్ర పర్యటనకు తొలిసారిగా వచ్చిన గవర్నర్ ఉదయం 8గంటలకు కొండపైకి చేరుకోగా, అతిథిగృహం వద్ద ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్ గవర్నర్‌కు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలకగా, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడినుంచి ఎలక్ట్రిక్ వాహనంలో 8.10గంటలకు విష్ణుపుష్కరిణి చేరుకొని వేద మంత్రోచ్చరణ నడుమ సంకల్పం చేశారు. తిరిగి అక్కడి నుంచి అదే వాహనంలో 8.30గంటలకు తూర్పు రాజగోపురం ఎదురుగా అఖండ దీపారాధన అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం టెంకాయ కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి 8.36గంటలకు తూర్పు రాజగోపురం నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు నల్లంథిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు అర్చకబృందం గవర్నర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు మెమొంటో, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి లడ్డూ ప్రసాదం అందజేశారు. సుమారు 36 నిమిషాలు ఆలయంలో ఉన్న గవర్నర్ 9.11గంటలకు పశ్చిమ రాజగోపురం నుంచి ఆలయం వెలుపలికి వచ్చి మూడు నిమిషాలు విలేకరులతో మాట్లాడారు. అక్కడినుంచి లిఫ్ట్ ద్వారా అతిథిగృహానికి చేరుకొని అల్పాహారం చేసిన అనంతరం 9.55గంటలకు బయటకు వచ్చి రోడ్డు మార్గంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు తిరుగు ప్రయాణమయ్యారు.

పటిష్ఠ బందోబస్తు

యాదగిరిగుట్ట క్షేత్ర పర్యటనకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాగా, డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పర్యటనలో భాగంగా ఇద్దరు అదనపు ఏసీపీలు, ఏసీపీలు నలుగురు, ఇద్దరు సీఐలు, 10మంది ఎస్ఐలు, 120మంది సివిల్ పోలీసులు, ఏఆర్ పోలీసులు 30 మంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది 30మంది, అటవీ శాఖ 20మందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

రెండు గంటలపాటు ఉభయ దర్శనాల నిలిపివేత: గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉదయం 7.45గంటలకే ఉభయ దర్శనాలు నిలిపివేశారు. అరగంట బ్రేక్ దర్శనం అనంతరం 10.30గంటల నుంచి ఉభయ దర్శనాలు ప్రారంభించారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్వామివారి ఆశీర్వచనాలు ఇస్తున్న ప్రధాన అర్చకులు నల్లంథిఘల్ లక్ష్మీనర్సింహాచార్యులు



భువనగిరి చెరువు

పక్కాగా సాగునీటి వనరుల సర్వే

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు కబ్జా కాకుండా చర్యలు
- అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట
- చెరువుల సరిహద్దులను నిర్ణయించేందుకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ
- యాదాద్రి జిల్లాలో 245చెరువులకు 219 నోటిఫై

యాదాద్రి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. చెరువు భూములు కబ్జాలు కాకుండా, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా లేఅవుట్‌లు చేయకుండా అడ్డుకట్ట వేసేందుకు చర్యలు ప్రారంభించింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటికే 'హైడ్రా' ద్వారా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు సాగుతుండగా, ప్రజల్లో మంచి స్పందన కన్పించడంతో జిల్లాల్లోని చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం దృష్టిసారించింది. అందులో భాగంగా సాగునీటి వనరుల సర్వే చేపట్టేందుకు నిర్ణయించింది.

హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో యాదాద్రి జిల్లా ఉండటంతో ఈ ప్రాంతంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేసి హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులతో కొత్త లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. అయితే ప్రభుత్వం చెరువులు, కుంటలు, నాలాల పరిధిలో వెలిసే లేఅవుట్లపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల్లో ఫుల్‌ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ల హద్దులు నిర్ణయించేందుకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ, బొమ్మలరామారం మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో హెచ్ఎండీఏ పరిధిలో 245 చెరువులు ఉన్నాయి. ఇప్పటివరకు 219 చెరువులకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్ఎండీఏ, స్థానిక సంస్థల అధికారులు సమన్వయంతో చెరువులు, కుంటల సర్వే చేయనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. మండలాల వారీగా సర్వే చేపట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది.

పకడ్బందీగా చెరువులు, కుంటల సర్వే

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించి లేఅవుట్లుచేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ప్రస్తుతం హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీచేసిన 219 చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల సరిహద్దులను నిర్ణయించనున్నారు. చెరువులు, కుంటలకు సమీపంలో ఉన్న భూముల రైతులను సంప్రదించి, సంబంధిత అధికారులు సర్వే నిర్వహించనున్నారు. రైతుల సమక్షంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిని నిర్ణయిస్తారు. ఈ మేరకు ఆయా రైతులకు అధికారులు సమాచారం ఇస్తారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో శిఖం భూముల పట్టాలు ఉన్నాయి. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలను పరిశీలించి హద్దులను నిర్ణయించనున్నారు.

చెరువులు, కుంటల వారీగా నివేదికలు

హెచ్ఎండీఏ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు చెరువులు, కుంటలపై జిల్లాయంత్రాంగం సమగ్ర నివేదిక రూపొందిస్తోంది. చెరువు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఉంది, ఎంత మేరకు కబ్జాకు గురైంది, ఏమైనా నిర్మాణాలు ఉన్నాయా? తదితర వివరాలతో నివేదిక రూపొందిస్తున్నారు. ఈ నివేదిక ఆధారంగా భవిష్యత్‌లో చర్యలు తీసుకునే అవకాశం ఉంది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గూగుల్ మ్యాప్‌ల ద్వారా సర్వే చేయనున్నారు.

నోటిఫికేషన్ చేసిన చెరువుల్లో సర్వే



జిల్లాలోని హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణకు నోటిఫికేషన్ జారీచేసింది. ఐదు మండలాల్లోని 245 చెరువులకు ఇప్పటివరకు 219 చెరువులకు నోటిఫికేషన్ జారీచేశాం. శిఖం పట్టాపాస్‌పుస్తకాలు ఉన్న రైతులతో పాటు చెరువులు, కుంటల పక్కనున్న భూముల రైతుల సమక్షంలో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సర్వే చేస్తాయి. చెరువుల సరిహద్దులను నిర్ణయించి, హద్దురాళ్లను వెంటనే ఏర్పాటు చేయనున్నాం. భవిష్యత్‌లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో లేఅవుట్‌లో హెచ్ఎండీఏ అనుమతులు ఇవ్వకుండా ఉపయోపడుతుంది. వీలైనంత త్వరగా సర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

కె.గంగాధర్, యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్

చెరువులకు చెర వీడేదెన్నడో?



దేవరకొండలో చెరువు శిఖంలో వెలసిన నిర్మాణాలు

త్రిపురారం: దశాబ్దాలుగా చెరువులు అన్యాక్రాంతం అవుతున్నా ఎవ్వరికీ పట్టడం లేదు. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలోని బెజ్జికల్ గ్రామానికి పడమర వైపు 35 ఎకరాలు, తూర్పు వైపు 40 ఎకరాల విస్తీర్ణంలో రెండు చెరువులు ఉన్నాయి. సాగర్ ఆయకట్టులో ఉండటంతో పంట భూముల ధర బాగా పెరగడంతో మూడెకరాలు మినహా రెండు చెరువుల 72 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. చెరువుల తూములు ధ్వంసం చేయడంతో సాగర్ కాల్వలు పక్క నుంచే వెళ్తున్నా, చెరువుల్లోకి చుక్క నీరు చేరడం లేదు. ఈ ప్రాంతంలో ఎకరం భూమి విలువ సుమారు రూ.40లక్షల వరకు ఉండగా, రూ.28కోట్ల విలువైన 72ఎకరాల చెరువు శిఖం కబ్జాకు గురైంది. అదేవిధంగా పెద్దదేవులపల్లి పంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెం చెరువు 58 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, సుమారు 40ఎకరాలు కబ్జా గురైంది. ఒకప్పుడు మత్స్యకారులు చెరువు ఆధారంగా జీవనం సాగించగా, పదేళ్ల నుంచి చుట్టు పక్కన భూములు ఉన్న రైతులు ఆక్రమించడం ప్రారంభించారు. కొందరు రైతులు నాలుగు నెలల క్రితం చెరువులో మట్టిపోసి మడులు కడుతుండగా మత్స్యకారులు అడ్డుకున్నారు. అదే రోజు కలెక్టర్, నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని త్రిపురారం రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించినా, నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెరువు కళ్ల ముందే కనుమరుగవుతున్నా చర్యలు తీసుకునే వారు లేక మత్స్యకారులు నిస్సహాయంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కంపాలపల్లి చెరువు సుమారు 2వందల ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, సగం భాగం ఆక్రమణకు గురైంది. కామారెడ్డిగూడెం, అంజనపల్లి గ్రామాల్లో చెరువులు పంట పొలాలుగా మారాయి.

కబ్జా కోరల్లో చెరువులు, కుంటలు

చందంపేట, దేవరకొండ: చందంపేట మండలంలోని గన్నేర్లపల్లి, గాగిళ్లాపురం, ముడుదండ్ల, హంక్యతండా, చందంపేట మండల కేంద్రంలోని పోసానికుంట చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయి. కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, ఇటుక వ్యాపారులు యథేచ్ఛగా చెరువుల మట్టిని తవ్వి వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారు. దేవరకొండ, కొండమల్లేపల్లిలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో చెరువులు, కుంటల శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దేవరకొండలోని తుల్చమ్మకుంట 10.20ఎకరాల వరకు విస్తీర్ణం ఉండగా, కొందరు 1.20ఎకరాల వరకు శిఖం భూమిని ఆక్రమించి నిర్మానాలు చేశారు. కొండమల్లేపల్లిలో బస్టాండ్ పక్కన ఉన్న కుంటలో కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేశారు. నాగార్జునసాగర్ రోడ్డులోని కుంటలో ప్రహరీ నిర్మించినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు.

సామర్థ్యాల పెంపునకు లిప్

ఈ విద్యాసంవత్సరంలో 6 నుంచి 9వ తరగతి వరకు పకడ్బందీగా అమలు



వేములపల్లిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, ఆగస్టు 27: సాధారణంగా తరగతికి ప్రవేశం పొందే విద్యార్థికి కింది తరగతుల అభ్యసన సామర్థ్యాలు ఉండాలి. అయితే కొందరు విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు లేకుండానే పైతరగతుల్లో ప్రవేశం పొందుతున్నట్టు విద్యాశాఖ గుర్తించింది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు విద్యాశాఖ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)ను అమలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ల పరిధిలోని పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక అభ్యసన కార్యక్రమం అమలు చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలోనే ఈ కార్యక్రమం అమలులోకి వచ్చినా, ఉపాధ్యాయులపై రికార్డుల భారం అధికంగా ఉండేది. దీన్ని దృష్టిలో ఉంచుకొని 2024-25 విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని సరళతరం చేసి అమలుచేస్తున్నారు.

ఉపాధ్యాయులు చేపట్టాల్సిన అంశాలివి..

- ప్రతీ ఉపాధ్యాయుడు 6 నుంచి 9వ తరగతి వరకు బోధించే సబ్జెక్టులకు వార్షిక ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. టీచర్ డైరీ తప్పకుండా రాయాలి. పిరియడ్ ప్లాన్, సబ్జెక్టు పాఠ్యాంశం, ఉప భావనలు, సంబంధిత పాఠ్యాంశ బోధనలో విద్యార్థులు సాధించే అభ్యసన ఫలితాలను పొందుపరచాలి.
- సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రతీ మూడు నెలలకొకసారి స్వీయ పరిశీలన పత్రాన్ని తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపరచాలి.
- విద్యా సంవత్సరంలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల అభ్యసన స్థాయిలను తెలుసుకునేందుకు ప్రతీ మూడు నెలలకొకసారి పరీక్షలు నిర్వహించి స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలి. ఆగస్టు నెలలో బేస్‌లైన్, డిసెంబరు చివరి వారంలో మధ్యంతర పరీక్ష, మార్చిలో అంత్య పరీక్ష నిర్వహించి విద్యార్థుల ప్రగతిని నమోదు చేయాలి.
- నిర్దేశించిన బోధన సోపానాలను అనుసరించి బోధన చేయాలి.
- ఉపాధ్యాయుడు సంబంధిత తరగతికి నిర్దేశించిన కనీస సామర్థ్యాలు ప్రతీ విద్యార్థి సాధించేలా బోధనా పద్ధతులను అనుసరించాలి.
- ప్రతీ సబ్జెక్టు వారీగా ఈ కార్యక్రమం అమలులో సంబంధిత ఉపాధ్యాయులు అనుసరించాల్సిన విధి, విధానాలను ఉత్తర్వుల్లో సూచించిన మేరకు ఆచరించాలి.
- ఉపాధ్యాయుడు బోధిస్తున్న సమయంలో నిర్దేశించిన పరిశీలన పత్రాలను అనుసరించి ప్రధానోపాధ్యాయుడు, లేదంటే పరిశీలన అధికారి పరిశీలించి నమోదు చేయాలి.
- ప్రస్తుతం కార్యక్రమ అమలులో సంబంధిత తరగతికి నిర్దేశించిన అభ్యసన ఫలితాలు సాధించడంతో పాటు నిర్ణీత సమయంలోగా అన్ని తరగతుల సిలబస్ పూర్తి చేయాలి.

'లిప్'పై ప్రత్యేక శ్రద్ధ



అభ్యసన అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు ప్రథమ పర్యవేక్షకులుగా భావించి పరిశీలించాలి. అందుకు సంబంధించి మార్గదర్శకాలు కూడా ఇచ్చాం. మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి. మండల, క్లస్టర్ నోడల్ అధికారులు వారంలో రెండు రోజులు పాఠశాలను సందర్శించి మార్గనిర్దేశనం చేయాలి. టీచర్ సపోర్ట్ గ్రూపు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రధానోపాధ్యాయులు, మానిటరింగ్ అధికారులు స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పర్యవేక్షణ అంశాలను పొందుపరచాలి. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు త్వరలో శిక్షణ ఇస్తాం. ఇప్పటికే జిల్లాలోని పాఠశాలల్లో ఎస్ఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్నపత్రాలతో బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించాం.

బొల్లారం భిక్షపతి, డీఈవో

కవితకు బెయిల్‌తో..
బీఆర్ఎస్ సంబురాలు



●8లో..

నల్లగొండలో బాణాసంచా కాల్చుతున్న కార్యకర్తలు

ఆర్టీసీని
ప్రభుత్వంలో విలీనం చేయాలి



●7లో..

నల్లగొండలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కేసుల విచారణ త్వరగా పూర్తిచేయాలి

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర

నల్లగొండ క్రైం, ఆగస్టు 27: పెండింగ్ కేసులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను విచారించే సమయంలో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. కేసు నమోదునుంచి చార్జిషీట్ వరకూ ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశోధనచేయాలన్నారు. పోక్సో కేసులను త్వరగా విచారించి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసుల విషయంలో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. కొత్త కేసులతోపాటు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసులసంఖ్యను తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పనిచేయాలన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ గంజాయిరహిత జిల్లాగా మార్చాలన్నారు. జిల్లాలో దొంగతనాలు జరగకుండా పగలు, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేస్తూ ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, గంజాయి, జూదం, అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణాలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు రమేష్, కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, గిరిబాబు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

హెచ్ఐవీని అరికట్టేందుకు కృషి

● డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఆగస్టు 27: సమాజంలో హెచ్ఐవీని అరికట్టేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషిచేయాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ సోకే మార్గాలు, నివారణ చర్యలు, సుఖ వ్యాధులు, వాటికి కారణాలు, చికిత్స, తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన ఉండాలన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల ద్వారా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి సక్కుబాయి మాట్లాడుతూ, హెచ్ఐవీ సోకిన పిల్లలకు పౌష్టికాహారం నిమిత్తం రూ.4వేలను తమ శాఖ నుంచి ఇస్తున్నామన్నారు. డిప్యూటీ వైద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి అరుంధతి మాట్లాడుతూ, జిల్లాలో హెచ్ఐవీ తగ్గుముఖం పట్టిందని, 0.5శాతం హెచ్ఐవీని తగ్గించగలిగామన్నారు. 2030 నాటికి సున్న శాతానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు ఉపేందర్, నరసింహ, నళిని, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కణ్ణన్
తిరునక్షత్రోత్సవాలు ప్రారంభం

●6లో..





క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 27: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలతో పూజలు నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులకు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,95,705 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్యనారాయణ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి వేదఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.


అద్దాల మండపంలో హారతి ఇస్తున్న అర్చకస్వాములు

వైభవంగా కణ్ణన్ తిరునక్షత్రోత్సవాలు ప్రారంభం


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కణ్ణన్(శ్రీకృష్ణాష్టమి వేడుకలు) తిరునక్షత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు త్రయాహ్నిక దీక్షతో తిరునక్షత్రోత్సవాలు చేపట్టడం ఆచారంగా వస్తోంది. తొలిరోజైన మంగళవారం సాయంత్రం ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి నవకలశ స్నపనం, మూలమంత్ర, మూర్తి మంత్రహవనాలు చేపట్టిన పూజారులు పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ఏడుగంటల సమయంలో చతుర్వేద పారాయణం, దివ్యప్రబంధ పాశుర పఠనం, ప్రత్యేకఅర్చన, నివేదనలు,మంగళశాసనం, చాత్మార, తనీయ విన్నపం తీర్థ గోష్ఠితో కార్యక్రమం ముగిసింది. ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో నెలవంక, రోహిణి నక్షత్రాన్ని వేసి శ్రీకృష్ణుడికి(కణ్ణన్) ఉత్సవాలు జరిపారు. 12రకాల ప్రసాదాలతో స్వామివారికి నివేదన చేపట్టిన అర్చకులు గోశాలలోని గోవులకు అధికారులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్స చేసిన కొద్దిగంటల్లోనే మృత్యుఒడికి..


ఆస్పత్రి ఎదుట రోదిస్తున్న మృతురాలి బంధువులు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 27: కడుపునొప్పితో బాధపడుతున్న వివాహిత శస్త్రచికిత్స చేసిన కొద్ది గంటల్లోనే మృతిచెందింది. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఈ సంఘటన జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన గంజ మంగ(40) కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో కుటుంబసభ్యులు మూడు రోజుల కిందట చికిత్స నిమిత్తం మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్‌కాలనీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు గర్భసంచిలో గడ్డలు ఉన్నట్లుగా నిర్ధారించి శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందని చెప్పారు. కుటుంబసభ్యుల అనుమతి మేరకు సోమవారం ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్సద్వారా గర్భసంచిలోని గడ్డలు తొలగించారు. శస్త్రచికిత్స పూర్తయిన కొద్దిగంటల వ్యవధిలో మంగ ఆరోగ్యపరిస్థితి భిన్నంగా మారి స్పృహ కోల్పోయింది. ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెపోటు వచ్చినట్లుగా నిర్ధారించారు. సీపీఆర్ చేసిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. సదరు మహిళ ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా మారడంతో మార్గమధ్యలోని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్న క్రమంలో మృతి చెందింది. అయితే మహిళ మృతికి మిర్యాలగూడ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మంగ బంధువులు మంగళవారం ఆసుపత్రి ఎదుట ఆందోళనకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయంలో ఇరువర్గాల పెద్దమనుషులు జోక్యం చేసుకొని రాజీ కుదిర్చినట్లు తెలుస్తోంది. దీంతో బంధువులు శాంతించి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి దహనసంస్కారాలు నిర్వహించారు. మంగకు భర్త, ఇద్దరు పిల్లలున్నట్లు సమీప బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.



















వరుస వర్షాలతో పత్తి చేలకు జీవం



చౌటుప్పల్‌లో పత్తి చేలకు బలంగా వచ్చిన కాయలు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 27 : ఇటీవల కురిసిన వర్షాలు పత్తి చేలకు జీవం పోశాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో పత్తి చేలు కాతకు వచ్చాయి. పట్టణంతో పాటు మండలంలో 11,500 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. మే, జూన్ మాసాల్లో సాగు చేసిన పత్తి చేన్లకు కాయలు బలంగా వచ్చాయి. అన్నిరకాల వాతావరణం అనుకూలించే నల్లరేగడి భూముల్లో ఒక్కొక్క పత్తి చెట్టుకు 100కు పైగా కాయలు వచ్చే అవకాశం ఉంది. వచ్చే నెల చివరి నాటికి పత్తి పంట చేతికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదునులో వర్షాలు కురవడంతో పత్తి పంటకు తెగుళ్లు సోకలేదు. దీంతో పత్తి రైతులకు అదనపు భారం తగ్గింది. మూడేళ్లుగా నెలకొన్న అనావృష్టి పరిస్థితులతో వరి సాగును రైతులు గణనీయంగా తగ్గించి పత్తి పంట సాగుపై దృష్టి సారించారు. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా చేసుకొని జీవనం సాగించే రైతులు ఆరుగాలం కష్టించి పత్తి సాగును చేస్తున్నారు. పత్తి పంట దిగుబడిపై రైతులు పెట్టుకున్న ఆశలు నెరవేరుతాయని భావిస్తున్నారు.

పత్తి చెట్టుకు 50 నుంచి 75 కాయలు



నల్లరేగడి భూముల్లో ఒక్కొక్క పత్తి చెట్టుకు 50 నుంచి 75కాయల వరకు వస్తాయి. ఎర్ర, దుబ్బ భూముల్లో 25నుంచి 50వరకు కాయలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదునులో వర్షాలు కురియడంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకున్న పక్షంలో పత్తి చేలు బలంగా పెరగడంతో పాటు కాయల సంఖ్య కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. పత్తి దిగుబడి దసరా పండుగ వరకు వస్తుంది. ఈసారి వర్షాలకు తెగుళ్లు సోకలేదు. రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలను అందిస్తున్నాం.

మస్కి శంకరయ్య, ఏఇవో, జైకేసారం క్లస్టర్, చౌటుప్పల్ మండలం

తెగుళ్లు సోకకపోవడం అదృష్టం



ఈ సారి పత్తి పంటకు తెగుళ్లు సోకకపోవడం అదృష్టంగా భావిస్తున్నాం. సకాలంలో కురిసిన వర్షాలతో తెగుళ్లు దరిదాపుల్లోకి చేరలేదు. 10రోజుల తరువాత మరో వర్షం కురిస్తే ఎంతోమేలు. పత్తి దిగుబడి పెరిగి అప్పులు తీరే అవకాశాలు ఉంటుంది.సెప్టెంబరు చివరివారం నుంచి పత్తి కోయడం మొదలవుతుంది.

దిండు వెంకటేశం, రైతు, పంతంగి, చౌటుప్పల్ మండలం

పారిశుధ్యం ఇలా.. జ్వరాలు తగ్గేదెలా?

● విషజ్వరాలకు కేరాఫ్‌గా మార్కెట్లు ● చెత్తతో నిండిన లింగగిరి రోడ్డు



పాతపంచాయతీ వీధిలో రోడ్లపై వేసిన చెత్తను తింటున్న మూగజీవాలు

హుజూర్‌నగర్, ఆగస్టు 27 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో మార్కెట్ ప్రాంతం విషజ్వరాలకు కేంద్రంగా మారింది. పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ముఖ్యంగా హుజూర్‌నగర్‌లోని పాతగ్రామపంచాయతీ, చికెన్ మార్కెట్ సెంటర్, కూరగాయల మార్కెట్ వీధి, లింగగిరి రోడ్డు, పాల్వాయి రామకోటేశ్వరరావు మిల్లు వీధి, సుందరయ్యనగర్ కాలనీ, శివాలయం బజార్, మిర్యాలగూడ రోడ్డు, ఇందిరాసెంటర్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కూరగాయల వ్యాపారులు రోడ్లపైనే చెత్తాచెదారం, మురిగిన కూరగాయలను రోడ్లపై పారబోస్తున్నారు. దీంతో రోడ్డంతా చెత్తంతా రోడ్డును ఆక్రమిస్తోంది. కిరాణ షాపుల యజమానులతో పాటుగా కూరగాయల వ్యాపారులు చెత్తను విసిరి వేస్తుండడంతో ప్రజలకు తీవ్రఅసౌకర్యం కలుగుతోంది. ముఖ్యంగా లింగగిరి రోడ్డులోని కూరగాయల దుకాణాలు, పాత గ్రామ పంచాయతీకి ఎదురుగా పక్కనే ఉన్న దుకాణదారులు రోడ్లపైన మురిగిపోయిన చెత్తను పారబోస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని చేపల మార్కెట్ వద్ద కనీస పరిశుభ్రత కరువైంది. సెలవు రోజులతో పాటు పండుగలు, జాతరలు వస్తే చేపల మార్కెట్, చికెన్, మటన్ సెంటర్ల వద్ద అపరిశుభ్ర తాండవిస్తోంది. ప్రతిరోజూ సాయంత్రం మురిగిపోయిన కూరగాయలు రోడ్లపై పారవేయడంతో వాటిని తినేందుకు మూగజీవాలు పెద్దసంఖ్యలో రోడ్లపైకి వస్తున్నాయి. పట్టణంలో సుమారు 100 ఆవులు రోడ్లపై తిరుగుతున్నాయి. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వ్యర్థాలను తొలగించడం లేదని ఆయా ప్రాంతాల వాసులు ఆరోపిస్తున్నారు. కాగా రోడ్లపై పడేసిన వ్యర్థాలతో ఆయా ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగీ లాంటి జ్వరాలకు ఆయా అపరిశుభ్ర ప్రాంతాలు కేంద్రాలుగా మారుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి మార్కెట్లలో రహదారులపై వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

వ్యాపారులు సహకరించాలి



పారిశుధ్య నిర్వహణకు వ్యాపారులు సహకరించాలి. చెత్తాచెదారంతో మార్కెట్లు విషజ్వరాలకు కేరాఫ్‌లుగా మారాయి. వ్యాపారస్తులు, కూరగాయల దుకాణదారులు రోడ్లపై చెత్తాచెదారం, మురిగిన కూరగాయలు పారబోస్తున్నారు. చెత్తకుండీలు ఏర్పాటుచేసి చెత్తను రహదారులపై పోయకుండా చూడాలి.

ముల్కలపల్లి సీతయ్య, హుజూర్‌నగర్

పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాం

వ్యాపారులు చెత్తాచెదారాన్ని రహదారులపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చెత్త సేకరణకు ప్రతి రోజూ ట్రాక్టర్లను వినియోగిస్తున్నాం. మురిగిన కూరగాయలు రోడ్లపై పోస్తే సహించం. చెత్తను ట్రాక్టర్లలో వేసి సహకరించాలి

యకోబుపాషా, మునిసిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

ప్రభుత్వంలో విలీనం చేయాలి: ఆర్టీసీ జేఏసీ



దేవరకొండ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నల్లగొండ, ఆగస్టు 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆర్టీసీ డిపోల ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నాయకులు మాట్లాడుతూ 2013ఆర్పీఎస్ బాండ్, 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించాలన్నారు. అలవెన్సులను తక్షణమే సవరించాలని, 2021 వేతన సవరణ అమలు చేయాలని, డీఏల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి ట్రేడ్ యూనియన్లను అనుమతించాలన్నారు. మహాలక్ష్మి స్కీంతో జరిగే అనర్థాలకు కండక్టర్లను బాధ్యులను చేయవద్దన్నారు. కార్యక్రమంలో నల్లగొండ రీజియన్ జేఏసీ నాయకులు టీజే.రావు, ఎస్ఆర్సీ.రాజు, బాసాని వెంకటయ్య, డిపో జేఏసీ నేతలు ఈఎస్.రెడ్డి, ఏఎల్.స్వామితో పాటు కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవరకొండ: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దేవరకొండ ఆర్టీసీ డిపో ఎదుట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో రమేష్‌గౌడ్, యాదయ్య, మల్లేష్, శ్రీనివాస్, దీప్లాల్, ఉస్మాన్, జానిబాష, సునీల్ రాజ్, రాజేందర్, జహీద్‌ఖాన్ పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: ఆర్టీసీ కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ జేఏసీ హైదరాబాద్ జోన్ నాయకుడు సుంకరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నల్లగొండ రీజియన్ కార్యదర్శి ఎస్ఎస్ గౌడ్, వీ.సేవ్య, ఆర్.సైదులు, రేస్ శ్రీనివాస్‌గౌడ్, లచ్చయ్య, ఏకాంబరం, ఆర్ఆర్ రావు, బి.సైదులు, సీహెచ్ వెంకటయ్య, జీఎల్‌రావు, పవన్, జయబాస్కర్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల కారు ఢీకొని ముగ్గురు మృతి



హుస్సేన్ మృతదేహం

వేములపల్లి, ఆగస్టు 27 : బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామశివారులోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై జరిగింది. ఏఎస్ఐ నరసింహారావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్(33) మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని శ్రీలక్ష్మి మోడ్రన్ రైస్ మిల్లులో మిల్లుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని మిర్యాలగూడకు బైక్‌పై వెళ్తున్నాడు. అదేసమయంలో గుంటూరు వెళ్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో హుస్సేన్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకొని మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. హుస్సేన్ కుమార్తె అఫ్సార్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

చౌటుప్పల్ సమీపంలో..

చౌటుప్పల్ రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారంలో కారు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. వలిగొండ మండలం కేర్చిపల్లికి చెందిన కళ్లెం శ్రీధర్‌రెడ్డి(45) హైదరాబాద్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం స్వగ్రామానికి బైక్‌పై వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హైదరాబాద్-వరంగల్ హైవేపై ఎక్సైజ్ కానిస్టేబుల్..

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 27: రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సీఐ రమేశ్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరులో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వాంకుడోతు కిమ్యానాయక్(55) భువనగిరిలో పనులు ముగించుకుని ఆలేరుకు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బయలుదేరాడు. హైదరాబాద్-వరంగల్ జాతీయరహదారి వంగపల్లి వద్ద వెనక నుంచి కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కిమ్యానాయక్ కుమారుడు తిలక్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్సపొందుతూ గ్రామపంచాయతీ వర్కర్..

మద్దిరాల, ఆగస్టు 27: చికిత్స పొందుతూ గ్రామపంచాయతీ వర్కర్ మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చౌళ్లతండా గ్రామ పంచాయతీలో మంగళవారం జరిగింది. ఎస్ఐ వీరన్న, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌళ్లతండా పంచాయతీకి చెందిన భూక్య మల్సూర్, పూలమ్మ దంపతుల మూడో కుమారుడు భూక్య నవీన్(21)గ్రామపంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మద్యం సేవించడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ ఈ నెల 24న క్రిమిసంహారక తాగాడు. గమనించిన తల్లిదండ్రులు సూర్యాపేట తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి నుంచి సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. నవీన్ అంత్యక్రియలకు రూ.5వేలు పంచాయతీ కార్యదర్శి రాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. నవీన్ తండ్రి మల్సూర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరన్న తెలిపారు.

విజ్ఞానం కోసం గ్రంథాలయం ఎంతో దోహదం



జనగాంలో గ్రంథాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం ఆగస్టు 27: జ్ఞానం పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం గ్రామంలో జేడీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన కాళోజీ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించి, పుస్తకాలను, ఫొటో ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచన నుంచి చైతన్యం నాంది అవుతుందన్నారు. చదువుకున్న వారిలో ఆలోచనా శక్తి అధికంగా ఉంటుందన్నారు. 30 ఏళ్ల కిందట నార్ల తాతారావు తీగలు లేని విద్యుత్ వస్తుందని చెప్పారని, అది ఇప్పుడు నిజమైందన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ యూనివర్సిటీని మహింద్రా కంపెనీ సీఈవో ఆనంద్‌మహీంద్రాతో కలిసి రూపకల్పన చేయిస్తున్నారని ఆయన తెలిపారు. అంతకుముందు సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ వీడియోకాల్ ద్వారా సందేశం వినిపించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ పింగళి కవితారెడ్డి, సభ్యుడు నాగమోహన్, డిప్యూటీ తహసీల్దార్ మమత, ఎస్ఐ జగన్, పాఠశాలల హెచ్ఎంలు విజయ, కర్ణ, నాగభూషణం, కిషన్, రెహమాన్, మల్లేష్, జెలిదె చంద్రశేఖర్, మంచాల జంగయ్య, కొండూరి స్వామి, గణేష్, మంచాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జనగాం గ్రామంలో ఆయన్ని కలిసిన జర్నలిస్టులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని జర్నలిస్టులు సన్మానించారు.

పగలు చూస్తారు, రాత్రికి ఎత్తుకెళ్తారు

● దొంగలుగా మారిన కూలీలు

● వ్యవసాయ మోటార్లు చోరీ చేసే ముఠా అరెస్ట్



సూర్యాపేటలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 27: వారంతా కూలీ పని చేస్తూనే మరోవైపు జల్సాల కోసం దొంగతనాలు చేస్తుంటారు. పంటలు సాగు చేసేందుకు బావులు, వాగులు, చెరువులపై ఏర్పాటుచేసిన మోటార్లను ఉదయం వేళల్లో గమనించి రాత్రికి ఎత్తుకెళ్తుంటారు. ఈ ముఠాను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 26న గరిడేపల్లి పోలీసులు మండలం కల్మలచెర్వు రోడ్డులో పరెడ్డిగూడెం వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన కూలీ పని చేసే ఉప్పతల వాసు, మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన రాయికొట్టె పని చేసే వేముల కోటేశ్వర్‌రావు కలిసి బైక్‌పై మఠంపల్లి వైపు నుంచి గరిడేపల్లి వైపు వెళ్తున్నారు. పోలీసులను గమనించి తప్పించుకోవాలని ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.5లక్షలు లభించాయి. దీంతో అనుమానంతో స్టేషన్‌కు తరలించి మరింతగా విచారించగా ఏడాదిగా వారితో పాటు మఠంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన కూలీ పని చేసే ఆకారపు వెంకటి, మఠంపల్లి మండలం సుల్తాన్‌పురంతండాకు చెందిన కూలీ పని చేసే అజ్మీర మంత్రియలతో కలిసి హుజూర్‌నగర్, చిలుకూరు, గరిడేపల్లి, పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెర్వు మండలాల పరిధిలో బావులు, చెరువులు, కుంటలు, వాగులపై ఏర్పాటుచేసిన వ్యవసాయ మోటార్లను ఉదయం పరిశీలించి, రాత్రి సమయంలో చోరీ చేస్తున్నట్లు అంగీకరించారు.అదేవిధంగా మోటార్లను ఎత్తుకెళ్లే వీలులేనిచోట్ల మోటార్లలో ఉండే కాపర్ వైర్‌ను చోరీ చేసి వాటిని ఆటోలో మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన పాత ఇనుము వ్యాపారం చేసే గడగంట్ల శ్రీనుకు వద్ద విక్రయిస్తుంటారు. అందులో భాగంగా కాపర్ వైరు విక్రయించగా వచ్చిన రూ.10లక్షలను నలుగురు వ్యక్తులు పంచుకున్నారు. ఇలా తమ వాటాగా వచ్చిన రూ.5 లక్షలను తీసుకుని వెళ్తుండగా పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెంటనే మండలంలోని కాసారిగూడెం వద్ద ఉన్న మరో నిందితులైన ఆకారపు వెంకటి, అజ్మీర మంత్రియలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3.81లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మఠంపల్లి మండలకేంద్రానికి చెందిన పాత ఇనుము వ్యాపారి శ్రీను వద్ద రూ.1.20లక్షల నగదుతో పాటు రూ.4.34లక్షల విలువైన 31 విద్యుత్ మోటార్లను, ఒక ఆటో, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పైఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. కాగా నిందితుల్లో ఉప్పతల వాసుపై ఆంధ్రప్రదేశ్‌లోని వత్సవాయి పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం తరలింపు కేసు, ఆకారపు వెంకటిపై మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు, గడగంట్ల శ్రీనుపై రేషన్ బియ్యం అక్రమంగా తరలించే కేసులు గతంలో నమోదయినట్లు ఎస్పీ తెలిపారు. విద్యుత్ మోటార్లను చోరీ చేసిన నిందితులను పట్టుకున్న పోలీసులను అభినందించి, రివార్డులు అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, హుజూర్‌నగర్ సీఐ జీ చరమందరాజు, గరిడేపల్లి ఎస్ఐలు చలగంటి నరేష్, ఈట సైదులు, సిబ్బంది నాగరాజు, రామారావు, శంభయ్య ఉన్నారు.

రైల్వే పోలీసులకు బాలిక అప్పగింత



బాలికతో అధికారులు

నల్లగొండ క్రైం, ఆగస్టు 27 : మహారాష్ట్ర పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న బాలికలను నల్లగొండ జిల్లా కేంద్రంలోని యువకులు మంగళవారం రైల్వే పోలీసులకు అప్పగించారు. నల్లగొండ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంబై నుంచి విజయవాడలోని చైల్డ్ వెల్ఫేర్ కేర్ సెంటర్‌కు మహారాష్ట్ర పోలీసులు 16 ఏళ్ల బాలికను ఈ నెల 25వ తేదీన లోకమాన్య తిలక్ రైలులో తరలిస్తున్నారు.ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నల్లగొండ రైల్వేస్టేషన్ వద్ద రైలు నెమ్మదిగా వెళ్తున్న క్రమంలో రైలు నుంచి దూకి బాలిక పరారైంది. పరారైన బాలిక మంగళవారం స్థానిక గొల్లగూడ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గమనించిన గొల్లగూడ యువత స్థానిక కాంగ్రెస్ నాయకుడు అల్లి సుభాష్‌యాదవ్‌కు తెలిపారు. వెంటనే వీరంతా కలిసి ఆ బాలికను చేరదీసి నల్లగొండ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రజితకు అప్పగించారు. రైల్వే పోలీసులు ఆ బాలికను మంగళవారం విజయవాడలోని చైల్డ్ వెల్ఫేర్‌కేర్ సెంటర్‌కు తరలించారు.

అక్రమంగా నిల్వ చేసిన మద్యం స్వాధీనం

రామన్నపేట, ఆగస్టు 27 : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో మద్యం అక్రమంగా నిల్వ చేయగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెద్దగోని సత్తయ్య ఇంటి వెనక గల చెట్ల పొదల్లో తనిఖీ చేయగా 25 లీటర్ల మద్యం లభ్యమైందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్టు

నల్లగొండ క్రైం, ఆగస్టు 27 : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 20వ తేదీన పట్టణంలోని ముశంపల్లి రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బియ్యం లోడ్‌తో వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేశారు. వాహనానికి ఎలాంటి కాగితాలు లేకపోగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి ఆటోలో ఉన్న వ్యక్తిని విచారించారు. పెద్దవూర మండలం గేమ్యానాయక్‌తండాకు చెందిన బాణావత్ చందూలాల్ తెలిపాడని సీఐ వివరించారు. చందూలాల్ నల్లగొండ పట్టణంలోని చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ తెల్లరేషన్‌కార్డుదారుల నుంచి కిలో బియ్యం రూ.9 చొప్పున కొనుగోలు చేసి నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీకి చెందిన రమావత్ హరిలాల్‌కు కిలో రూ.16కు విక్రయిస్తూ లాభం పొందుతున్నట్లు గుర్తించారు. రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

ఆలేరు రూరల్, ఆగస్టు 27 : మహిళ మెడలోని గొలుసు చోరీకి గురైంది. ఈ సంఘటన మంగళవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరులోని భరత్‌నగర్‌కు చెందిన బొద్దుల పద్మిని స్థానిక రైల్వేగేట్ వద్ద కూరగాయల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. దుకాణంమూసిన అనంతరం రైల్వేగేట్ దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును అపహరించుకుని వెళ్లాడు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీసీ పుటేజీలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని తీసుకొస్తాం



కేంద్ర మంత్రి సంజయ్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న నాగయ్య

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 27: అమెరికాలో చనిపోయిన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన తప్పి ప్రవీణ్ కుమార్ మృతదేహాన్ని ఇండియాకు తీసుకువస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్ రావు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి ప్రవీణ్‌కుమార్ కుటుంబసభ్యులు వచ్చి కలిశారు. ప్రవీణ్ మృతదేహాన్ని ఇండియాకు తీసుకురావడానికి సహకరించాలని వెంకటేశ్వర్‌రావును కోరారు. దీంతో మృతుడి తండ్రి నాగయ్యతో ఫోన్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో మాట్లాడించారు. మృతదేహాన్ని పాతర్లపహాడ్ తీసుకురావడానికి తాను కృషి చేస్తానని, ధైర్యంగా ఉండాలని మంత్రి హామీ ఇచ్చారు. అమెరికా అధికారులతో కేంద్రం చర్చలు జరుపుతోందన్నారు. త్వరలో ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని ఇండియాకు తెప్పిస్తామని సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

హైవే బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



చిన్నసూరారం గ్రామంలో హైవేపై రాస్తారోకో చేస్తున్న బాధితులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 27 : నకిరేకల్-నాగార్జునసాగర్(565) జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం చిన్నసూరారం గ్రామస్థులు మంగళవారం గ్రామంలోని 565 హైవేపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన 38 మంది బాధితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేద ని ఆరోపించారు. 38 మంది బాధితులకు సుమారు రూ.1కోటికి పైగా పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. హైవే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారగోని నర్సింహాగౌడ్, నారగోని సైదులు, పూలమ్మ, యాదయ్య, కూరగాయాల మంగమ్మ, చెవుగోని వెంకన్న, తేళ్ల నాగయ్య, సైదులు, నారగోని యాదగిరి, నవీన్, చంద్రయ్య, సుంకరబోయిన వీరయ్య తదితరులు ఉన్నారు.

రూ.1.52కోట్ల విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం



భూదాన్‌పోచంపల్లిలో పోలీసులకు పట్టుబడిన నిందితులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా హ్యాష్ ఆయిల్‌ను(ద్రవ రూపంలో ఉన్న గంజాయి) తరలిస్తున్న ఇద్దరు నిందితులను యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి రూ.1.52 కోట్ల విలువైన 10హ్యాష్ ఆయిల్ డబ్బాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీ రాష్ట్రం నుంచి బస్సులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న భువనగిరి ఎస్ఓటీ, భూదాన్‌పోచంపల్లి పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో బయలుదేరి మార్గ మధ్యలో భూదాన్‌పోచంపల్లి క్రాస్ రోడ్ కొత్తగూడెం వద్ద దిగి అయ్యప్పగుడి వద్దకు వచ్చిన ఇద్దరిని పోలీసులు తనిఖీచేశారు. వారి వద్ద 10హ్యాష్ ఆయిల్ డబ్బాలు గమనించి, విచారించారు. వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం కోలమామిడి గ్రామానికి చెందిన గమ్మేటి గోవిందరావు (36), కొర్ర రాంబాబు (30)గా గుర్తించారు. తమ ప్రాంతంలో తెలిసిన వ్యక్తుల నుంచి హ్యాష్ ఆయిల్‌ను సేకరించి చుట్టుపక్కల పట్టణాల్లో, సమీపంలోని అవసరమైన వినియోగదారులకు విక్రయించేవారని నిందితులు విచారణలో అంగీకరించారు. ఆ ప్రాంతానికే చెందిన చంటి, లక్ష్మీనాయుడుల నుంచి సుమారు 10.02 కిలోల హ్యాష్ ఆయిల్‌ను(10 డబ్బాలు) కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. కొత్తగూడెం వద్ద బస్సు దిగి భూదాన్‌పోచంపల్లికి రాగా పోలీసులు అరెస్టుచేశారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న హ్యాష్ ఆయిల్ విలువ రూ.1.52కోట్లు ఉంటుందని, మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సూర్యాపేటలో నలుగురు యువకులు..

సూర్యాపేట క్రైం, ఆగస్టు 27 : గంజాయిని విక్రయించేందుకు సిద్ధమైన నలుగురు యువకులను సూర్యాపేట జిల్లా కేంద్ర పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి పట్టణ సీఐ జీ రాజశేఖర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్యాపేటలోని తాళ్లగడ్డకు చెందిన ఫ్లెక్సీ వర్క్స్ చేసే షేక్ ఆసీఫ్‌బాబా, జేజే నగర్‌కు చెందిన ఇరుగు రోహిత్, తాళ్లగడ్డకు చెందిన కంప్యూటర్ డిజైన్ వర్క్స్ చేసే పాలేటి గణేష్, పిల్లలమర్రికి చెందిన గుమస్తాగా పనిచేసే బట్టు హరీష్ కలిసి నాలుగు రోజుల కిందట విశాఖపట్నం ప్రాంతానికి వెళ్లి అక్కడ ఓ వ్యక్తి వద్ద కిలో గంజాయిని కొనుగోలుచేశారు. అనంతరం సోమవారం రాత్రి సూర్యాపేటకు చేరుకుని ఆ గంజాయిని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం ఆరు గంటలకు పాత వ్యవసాయ మార్కెట్ వద్ద ఉండగా సమాచారం అందడంతో పోలీసులు ఆ నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు లింగయ్య, బాల్నె కుశలవ, సిబ్బంది గొర్ల క్రిష్ణయ్య, శ్రీరాములు, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, శివ, రవినాయక్ ఉన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి : సీపీఎం

నల్లగొండ రూరల్, ఆగస్టు 27: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.2లక్షల వరకు రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి, అమలులో అనేక నిబంధనలు విధించి రైతుల సంఖ్య కుదించడం సరికాదన్నారు. రాష్ట్రంలో 40లక్షల మంది అర్హత కలిగిన రైతులుంటే అందులో కేవలం 22లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.17వేల కోట్లు మాత్రమే జమ చేసినట్లు ప్రకటించారని తెలిపారు. 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, 60శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రైతులందరికీ వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేదలకు సేవలందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

శాలిగౌరారం, ఆగస్టు 27: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నామని రాష్ట్ర మల్టీపుల్ కౌన్సిల్ ఫాస్ట్ చైర్మన్ తీగల మోహన్‌రావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూర్యాపేట లయన్స్ ఆస్పత్రి సహకారంతో డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి సతీమణి శకుంతల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం, జోన్ చైర్మన్ ఉప్పల వెంకటరమణారెడ్డి తండ్రి బాలనర్సయ్య జ్ఞాపకార్థం గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కంటి వైద్య శిబిరంలో 200మందికి పరీక్షలు నిర్వహించి 26మందిని ఆపరేషన్ చేయడానికి గుర్తించారు. కొంతమందికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. ఆస్పత్రికి ఈసీజీ మిషన్, వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా రెండవ గవర్నర్ కేవీ ప్రసాద్, జిల్లా క్యాబినేట్ పాస్ట్ కోశాధికారి దుబ్బాక వెంకట్‌రెడ్డి, రీజన్ చైర్మన్ గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, ఉప్పల రాజేంద్రప్రసాద్, డెంకల సత్యనారాయణ, దేవరశెట్టి శ్రీనివాసులు, ఎర్ర శంభులింగారెడ్డి, గంట అంజిరెడ్డి, బుడిగె శ్రీనివాసులు, చామల మహేందర్‌రెడ్డి, మారోజు వెంకటాచారి పాల్గొన్నారు.

దుబ్బాక రాంమల్లేశ్‌కు పలువురి నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, ఆగస్టు 27: అనారోగ్యంతో సోమవారం మృతిచెందిన నార్కట్‌పల్లి పట్టణ సీపీఎం నాయకుడు దుబ్బాక రాంమల్లేశ్‌కు పలువురు నివాళులర్పించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, పుల్లెంల ముత్తయ్య, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శ్రీరామోజు వెంకటేశ్వర్లు, చింతపల్లి బయ్యన్న, బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి,భూపాల్‌రెడ్డి, జెరిపోతుల భరత్‌గౌడ్, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, పాల్వాయి భాస్కర్‌రావు, శ్రీనివాస్ తదితరులు రాంమల్లేశ్‌కు నివాళులర్పించారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

దామరచర్ల, ఆగస్టు 27: ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన విధంగా రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ అన్నారు. మండలకేంద్రంలో ఏవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చాలామంది రైతులకు రుణమాఫీ చేయలేదని, రాష్ట్రంలో కేవలం 45శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. అదేవిధంగా రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాపానాయక్, ఎర్రనాయక్, దయానంద్, ఖాజా మొహిద్దిన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'పుస్తక పఠనం అలవర్చుకోవాలి'

చండూరు రూరల్, ఆగస్టు 27: యువత పుస్తక పఠనం అలవర్చుకోవాలని జేడీ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పింగిలి కవితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెర్మట గ్రామంలో జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కాళోజీ పుస్తకాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. గ్రామాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి, యువతకు, పిల్లలకు పుస్తకపఠనాశక్తి పెంపొందింపచడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బురుకల బిక్షమయ్యగౌడ్, ఫౌండేషన్ సభ్యులు మాదగోని నాగార్జున, బురుకల ఎలక్షన్, నారపాక ఆంజనే యులు, మిట్టపల్లి రాజు, దాసరి అంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, ఆగస్టు 27: మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో మంగళవారం సుదర్శన హోమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి మాసం రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం సుదర్శన హోమం నిర్వహిస్తున్నారు. హోమం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు, దేవేందర్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, శశికుమార్, నవీన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, దుర్గారావు, అతిథి నాయర్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నల్లగొండ, ఆగస్టు 27: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ డైమండ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు కొనియాడారు. రామగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బోయవాడలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాలికలకు ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలుగు బెల్లి కరుణాకర్‌రెడ్డి, ఉరుకొండ ప్రభాకర్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు ఎం. అశోక్‌రెడ్డి, కార్యదర్శి బీరం మోహన్‌రెడ్డి, కోశాధికారి గడ్డం జానకిరెడ్డి, ఆర్‌సీ గడ్డం ప్రదీప్‌కుమార్, మాలె వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ కుట్రతోనే ఎమ్మెల్సీ కవిత అరెస్టు'

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 27: రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేశారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కవితకు బెయిల్ మంజూరు కావడంతో పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. సాగర్‌రోడ్‌లోని గాంధీ విగ్రహం ఎదుట బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, ధనావత్ చిట్టిబాబునాయక్, సాదినేని శ్రీను, ఎలియాస్, ఆంజనేయులు, వినోద్, ఫయాజ్, రాజకుమార్, వీరనాయక్, సైదా తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై విడుదల కావడంతో నల్లగొండ పట్టణ పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో మంగళవారం గడియారం సెంటర్‌లో బీఆర్ఎస్ నేతలు బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జమాల్ ఖాద్రీ, బొమ్మరబోయిన నాగర్జుణ, ఐతగోని యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడలో బాణాసంచా కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాగునీటి బాధ తప్పినట్లే

● చండూరు మునిసిపాలిటీకి అమృత్ 2.0 పథకం కింద రూ.9.80 కోట్లు మంజూరు ● త్వరలో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం ● పట్టణవాసుల హర్షం

చండూరు, ఆగస్టు 27: చండూరు పట్టణ ప్రజల తాగునీరు సమస్య త్వరలో తీరనుంది. అమృత్ 2.0పథకం కింద ఇప్పటికే చండూరు మునిసిపాలిటీకి రూ.9.80 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో త్వరలో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించి పట్టణ ప్రజలకు తాగు నీరు అందించనున్నారు. ఆగస్టు 6వ తేదీన ఈ పనులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. త్వరగా పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభు త్వం 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30శాతం, మున్సిపాలిటీ నుంచి మరో 20 శాతం నిధులు మొత్తం కలిపి రూ.9.80కోట్లు మంజూరయ్యాయి. వీటితో 10లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన(ఒక్కోటి 5లక్షల లీటర్లు) రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు. అవసరం మేరకు పైప్‌లైన్లు వేయనున్నారు. తాగునీరు అందని కుటుంబాలకు కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పట్టణంలో 11లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 13 మంచినీటి ట్యాంకులు ఉన్నాయి. నూతన ట్యాంకులు, పాతవి కలుపుకుని మొత్తంగా 20లక్షల లీటర్ల నీటిని పట్టణంలో సరఫరా చేయనున్నారు. మునిసిపాలిటీ పరిధిలో 10వార్డులు ఉన్నాయి. 13వేల వరకు పట్టణ ఓటర్లు ఉన్నారు. సరైన ఓవర్‌హెడ్ ట్యాంకులు లేకపోవడంతో, మునిసిపాలిటీ పరిధిలోని అంగడిపేట పరిధిలో ఉన్న అనేక కాలనీలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ గ్రామ ప్రజలు ఎక్కువ భాగం మిషన్ భగీరథ నీటికి దూరంగా ఉండి, ప్యూరిఫైడ్ నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. మంచినీటి సమస్య తీరుతుండడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



చండూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం. అమృత్ 2.0 పథకం అమలుతో నీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

● దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, మునిసిపల్ వైస్‌చైర్మన్.

త్వరలో పనులు చేపడతాం



చండూరు మునిసిపాలిటీకి అమృత్ 2.0 పథకం కింద రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు మొదలు పెట్టాం. పట్టణంలో నీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

● నాగప్రసాద్, ఏఈఈ, చండూరు మునిసిపాలిటీ.

నాలాలపై కట్టడాలుంటే చర్యలు తీసుకోవాలి

రామగిరి, ఆగస్టు 27: నల్లగొండ పట్టణంలో నాలాలపై నిర్మించిన కట్టడాలపై ఇప్పుడు స్పందించకుంటే మున్ముందు ప్రమాదాలు ఎదుర్కొక తప్పదని పలువురు కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరుగుతున్న హైడ్రా మాదిరిగా నల్లగొండలో కూడా అమలు చేయాలన్నారు. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు సమీపంలో, ప్రకాశం బజారులో నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. వర్షా కాలంలో వచ్చే వరదల నుంచి ప్రమాదాలు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు, నాలాలు, చెరువులు ఉన్నాయో నక్షా తీసి ప్రభుత్వ స్థలాల్లో, నాలాలపై నిర్మాణాలు ఉంటే చర్యలు తీసుకుంటామని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 13వ వార్డు కౌన్సిలర్ ఊట్కూరి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మర్రిగూడలో ఏడు గుంటల ప్రభుత్వ స్థలం కబ్జాకి గురైతే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పాతతగల్ బైపాస్ వద్ద రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన వ్యక్తికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని మునిసిపల్ ఎజెండాలో ఉండగా కౌన్సిలర్లు ఖయ్యుంబేగ్, అభిమన్యు శ్రీనివాస్, బండారు శ్రీనివాసు వ్యతిరేకించారు. రోడ్డు విస్తరణలో మునిసిపల్ స్థలమే అనే అనుమానముందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు. వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ మాట్లాడుతూ గతంలో వేసిన యూజీడీ మట్టితో కురుకుపోయిందని, సాధ్యమైనంత త్వరగా బాగు చేయాలని, వర్షాకాలంలో వరద, మురుగు నీరంతా ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నకిరేకల్, ఆగస్టు 27: ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వార్డెన్లతో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న పథకాలను అందించాలన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 16వ వార్డుకు చెందిన లబ్ధిదారురాలికి మంజూరైన రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. పెద్ద చెరువు వద్ద మంగళవారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన ఎమ్మెల్యే వేముల వీరేశం సరదాగా గాలంతో చేపలు పట్టారు. అక్కడున్న యువకులతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.


కేతేపల్లి: కష్టపడి పనిచేసే వారికే కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆలకుంట్ల సైదులు, చంద్రయ్య, కిష్టయ్య, అంజయ్య, పుల్లయ్య, వెంకన్న, యాదయ్య, యాదగిరి, బాబూరావు, లింగయ్య, జి. మాధవరెడ్డి, ఎస్‌కె. లతీఫ్, ఎడ్ల ప్రవీణ్, ఆర్. సైదులుగౌడ్ పాల్గొన్నారు.


కేతేపల్లిలో కార్యకర్తలకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నిడమనూరు, ఆగస్టు 27: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మడం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో బేస్‌లైన్ టెస్టును పరిశీలించి విద్యార్థులతో పాఠాలు చదివించారు. పదో తరగతిలో ఆంగ్ల పాఠ్యాంశాలు, బోధనా విధానాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు లావూరి వెంకన్న, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ఆదిరెడ్డి, అనిల్‌కుమార్, పద్మావతి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

తిరుమలగిరి(సాగర్): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపొందేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మండలంలోని కొంపెల్లి, రాజవరం, నేతాపురం పాఠశాలలను తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి వివిధ సబ్జెక్టులపై విద్యార్థులను ప్రశ్నలను అడిగి సమాధానం రాబట్టారు. ఆయన వెంట హెచ్‌ఎంలు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, అరుణకుమారి, అరుణ, నరేషాచారి, ఆనందగిరి, యాదగిరి, జె. నరసింహారావు పాల్గొన్నారు.


తిరుమలగిరి(సాగర్): కొంపెల్లిలో విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో

రైతులను గ్రామాల వారీగా సర్వే చేస్తాం

● జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్

శాలిగౌరారం, ఆగస్టు 27: రుణమాఫీ పొందని వారికి రైతులను గ్రామాల వారీగా సర్వే చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అడ్లూర్ గ్రామంలో పత్తి, వరి పొలాలను మంగళవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆయన రైతులతో మాట్లాడుతూ రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయాధికారి కార్యాలయానికి ఆధార్ కార్డు తీసుకొని వస్తే సీఎల్‌వో పోర్టర్‌లో రైతు రుణమాఫీకి సంబంధించిన సమాచార పత్రాన్ని రైతులకు అందజేస్తామన్నారు. కుటుంబసభ్యుల నిర్ధారణ కాని రైతులు యొక్క కుటంబ సర్వే త్వరలో నిర్వహించి పోర్టర్‌లో పొందుపరుస్తామన్నారు. రైతులకు సరిపడా ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సౌమ్య శృతి, ఏవోలు శ్రవణ్ కుమార్, నోముల కీర్తి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ తదితరులు ఉన్నారు.

వేములపల్లి: రుణమాఫీ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ఏడీఏ దేవ్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలు రకాల సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులు తమ సంబంధిత పత్రాలతో తమ గ్రామ పరిధిలోని ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులను ప్రభుత్వం త్వరలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ వర్తింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో రుషేంద్రమణి, ఏఈవోలు సంతోష్, మల్సూర్, నితిన్, రైతులు మాలి కాంతారెడ్డి, శంకర్‌రెడ్డి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.



కనగల్: సామాజిక సేవా కార్యకర్త న్యూ కంబాల ఫౌండేషన్ వ్యవ స్థాపకురాలు, కనగల్ గ్రామానికి చెందిన కంబాల శివలీలారెడ్డికి నంద మూరి తారకరామారావు నేషనల్ అవార్డు లభించింది. విజయవాడలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాద్ నుంచి ఆమె అవార్డు అందుకున్నారు.

నార్కట్‌పల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉట్టి కొట్టే వేడుకలను దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సిరెడ్డి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వారాల రమేశ్, కొండేటి వేణు, గంట మల్లయ్య, చీర యాదయ్య, చీర మల్లేశ్ పాల్గొన్నారు. మండలంలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉట్టి కొట్టారు.

పెద్దవూర: మండలంలోని చలకుర్తి రెవెన్యూ శివారులో ఏర్పాటు చేసిన సంపద వనాలను ఎఫ్‌డీవో రామ్మోహన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత సంవత్సరం చలకుర్తి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో 11, 250 చెట్లను పెంపకానికి చేపట్టారు. వాటి నిర్వహణ తీరుపై పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ నీరుడు బాలకృష్ణ, ఎంపీడీవో ఉమాదేవి, ఏపీవో యాత వెంకటేశ్వర్లు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ మధుసూదన్‌గౌడ్, పద్మాబాయ్ తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని ఆదిత్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి అన్నారు. సోషల్ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్ట అనిత పాల్గొన్నారు.

దామరచర్ల: గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల సమాఖ్య కార్యాలయం నుంచి దామరచర్ల చౌరస్తా వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది అవగాహన ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం దిలీప్‌కుమార్, ఆర్‌ఐ సురేందర్‌సింగ్, శ్రీనయ్య, శంకర్, మాధవి, సుధాకర్, కవిత, నాగమణి, సీతామహాలక్ష్మీ, సునీత, రమణ, నగేష్, హనుమంతు, నాగమణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త నకిరేకల్‌కు చెందిన ఎండీ యూసుఫ్ కంటి ఆపరేషన్ కోసం ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఛైద రవీందర్ రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. రవీందర్ ఇచ్చిన ఆర్థిక సాయంతో తాను చెన్నైలోని శంకర్ నేత్రాలయంలో కంటి ఆపరేషన్ చేయించుకున్నట్లు యూసుఫ్ తెలిపారు.

చింతపల్లి: గొడుకొండ్ల వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ ఆచార సంప్రదాయ ప్రకారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విశ్వక్షేన పూజ, స్వస్తిపుణ్యావచనం, తదితర కార్యక్రమాలు చేశారు. వేణుగోపాలస్వామి వారిని తొట్టిలో వేసి భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఛైర్మన్ అంగిరేకుల గోపాల్, ధర్మకర్తలు ప్రధానార్చకులు ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

శాలిగౌరారం: నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి కోరారు. శాలిగౌరారం మండలంలోని మాదారం గ్రామంలో వన నర్సరీని, నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో పద్మ, ఏపీవో జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చందంపేట: బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ మండల నాయకులు గోసుల శివ అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ కులగణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీని కులగణన చేసి చిత్తశుద్ధి రూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జబ్బు శ్రీశైలం, తిరుపతయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కట్టంగూరు: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 31న, సెప్టెంబరు 1, 2వ తేదీల్లో నిర్వహించే పీవోడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ఈదులూరులో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు బూరుగు లక్ష్మి, జిల్లా కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర, మణెమ్మ, సూరమ్మ, సురేఖ, మాదవి, పల్లవి, రత్తమ్మ తదితరులు ఉన్నారు.

50శాతం మంది రైతులకే రుణమాఫీ


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 27: రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో కేవలం 50శాతం మంది రైతులకే రుణమాఫీ అయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. రూ.2లక్షల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం చేపట్టిన ధర్నాలో మాట్లాడారు. రైతులు వ్యవసాయం సాగు కోసం బ్యాంకుల్లో చేసిన అప్పులు గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మాఫీ చేయకుండా మోసం చేసిందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న ప్రస్తుత ప్రభుత్వం కొంత మంది రైతులకే రుణాలు మాఫీ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు, నాయకులు ఎండీ మొయినుద్దీన్, గురజా రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, పబ్బు వీరస్వామి, లొడంగి శ్రవణ్‌కుమార్, బలుగూరి నరసింహ, పల్లా దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'హైడ్రా' తరహాలో 'మైడ్రా' ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 27: హైడ్రా తరహాలో మిర్యాలగూడ పట్టణంలో మైడ్రాను ఏర్పాటు చేసి కబ్జాకోరుల భరతం పట్టాలని టీడీపీ జిల్లా నాయకుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి పేరుతో పట్టణంతో పాటు శివారు కాలనీలలో పెద్దఎత్తున ఆక్రమణలు జరిగాయని ఆరోపించారు. భూబకాసురులు చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించారని, దీంతో వరదనీరు కాలనీలను ముంచెత్తుతోందన్నారు. ఆక్రమణలను స్వాధీన పరుచుకోవాలన్నారు. హైదరాబాదులో నిర్వహిస్తున్న దాడుల తరహాలో ఇక్కడి ఆక్రమణలపై జరిపి ప్రభుత్వ భూమి కాపాడాలన్నారు.

'మిర్యాల' మునిసిపాలిటీలో ఫిర్యాదుల కమిటీ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 27: మిర్యాలగూడ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ యూసుఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగినులపై లైంగిక, మానసిక వేధింపులు జరిగితే కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆర్వో జ్ఞానేశ్వరి అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

'ఫిర్యాదులపై ఎస్ఐ నిర్లక్ష్యం తగదు'

పెద్దవూర, ఆగస్టు 27: దళితులు ఇస్తున్న ఫిర్యాదులపై స్థానిక ఎస్ఐ వీరబాబు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దళిత ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో మంగళ వారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టంపై ఫిర్యాదుల చేసినా ఎస్ఐ పట్టించుకో వడం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడెపు నాగా ర్జున, పులిమాల కృష్ణారావు, చిలుముల దుర్గయ్య, మల్లెపల్లి నరేందర్, పెద నాగయ్య, దోరెపల్లి మల్లయ్య, కుక్కమూడి ముత్యాలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టౌన్, ఆగస్టు 27: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు శ్రావ్య, విశ్వజ్యోతి కోరారు. పట్టణంలోని లైన్‌వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇద్దరు ముగ్గురు సిబ్బందితో ప్రారంభమైన లైన్‌వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు హౌస్ సర్జన్లు వైద్య సేవలు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాక్సిన్లు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టరుల మోహిని, మనీన, విజయ్‌కుమార్, ఏఎన్ఎం సువార్తమ్మ, రేణుక, భాగ్యలక్ష్మి, నలిని, నాగమణి, వినోద, సిబ్బంది జానీ, శ్రీనివాస్, అంబేద్కర్, కళమ్మ, పద్మ, భాగ్యలక్ష్మి, రాజకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ సరిత, నాగేందర్, గోవర్ధన్ పాల్గొన్నారు.


సిల్వర్ జూబ్లీ వేడుకల్లో సన్మానం పొందిన డాక్టర్లు, సిబ్బంది

దేవరకొండ: దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు నూతన మంత్రివర్గంలో స్థానం కల్పించాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. బాలునాయక్‌కు మంత్రి పదవి ఇస్తే దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని, ప్రాజెక్టులు పూర్తవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. బాలునాయక్‌కు మంత్రి పదవి ఇస్తే దేవరకొండ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని గిరిజన సంఘం నాయకులు బాబురాంనాయక్ తోపాటు పలువురు మంగళవారం కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు.

హాలియా: బోయగూడెం గ్రామానికి చెందిన కర్నాటి కవిత లింగారెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సహకారంతో మంజూరైన రూ.48 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం అందజేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గుండా కృష్ణమూర్తి, దాస వెంకన్న, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వడ్త్యా రాజు, మన్నెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మచ్చ సునీత, ప్రధాన కార్యదర్శి చింతపల్లి రవీందర్, అంజయ్య, ఇస్రం చంద్రయ్య, సైదులు, అక్కయ్యబాబు, షాబుద్దీన్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: రైతులకు రుణమాఫీ చేయడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నరసింహ అన్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేయకుండా కేవలం 40శాతం మంది రైతులకు మాత్రమే చేసి చేతులు దులుపుకుందన్నారు. రైతు భరోసా నిధులు కూడా విడుదల చేయకపోవడంతో పంట సాగుకు పెట్టుబడి లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జాన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా నాగార్జునసాగర్‌లో హిందూ ఐక్యత సంఘం ఆధ్వర్యంలో పట్టణ బంద్ నిర్వహించారు. పాఠశాలలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు మూసి వేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాందాసు, రమేష్‌జీ, గణేష్, తంగరాజు, లక్ష్మణ్, నాగరాజు, నుమంతు, శ్రీనివాస్, రమణయ్య, మణిదీప్, చారీ, కోమల్, ముత్తులు తదితరులు పాల్గొన్నారు.